


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| సోమవారం 23 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 294 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ గట్టి కౌంటర్: అమెరికా మిత్రదేశాలపైనా దాడులు చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్, సందేశం టైమ్స్, ప్రతినిధి, మార్చి 23, 2026: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు ఇరాన్ అత్యంత తీవ్రస్థాయిలో స్పందిస్తూ అగ్రరాజ్యానికి చివరి హెచ్చరిక జారీ చేసింది. తమ దేశానికి చెందిన కీలక మౌలిక సదుపాయాలపై ఎలాంటి దాడులు చేసినా ఊరుకోబోమని, అందుకు ప్రతిగా తీవ్రమైన ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో కేవలం అమెరికానే కాకుండా, ఆ దేశానికి మద్దతుగా నిలిచే మిత్రదేశాలపైనా దాడులు చేస్తామని పేర్కొనడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ముఖ్యంగా ఆయిల్, ఎల్పీజీ, ఎల్ఎన్జీ ఉత్పత్తి కేంద్రాలతో పాటు ఐటీ మౌలిక సదుపాయాలు మరియు నీటి శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ బహిరంగంగా ప్రకటించింది. ఇరాన్ చేసిన ఈ తాజా వ్యాఖ్యలతో మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని, ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ఇంధన మార్కెట్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది.

## సిద్ధిపేటలో ప్రగతి వెల్లువ: రూ. 775.72 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం.. రైతు భరోసా నిధులు విడుదల



హైదరాబాద్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో నిర్వహించిన "ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు" కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు పాల్గొని జిల్లా వ్యాప్తంగా రూ. 775.72 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేస్తోందని, మూడు విడతల్లో రూ. 9,000 కోట్లను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. పదేళ్ల గత ప్రభుత్వంలో నెలకు సగటున రూ. 2,533 కోట్లు ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం 28 నెలలుగా నెలకు రూ. 5,500 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందని గుర్తుచేశారు. నర్మెట్టలో రూ. 300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన ఆయన, పంట మార్పిడి విధానంపై రైతులు దృష్టి సారించాలని, పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. సిద్ధిపేట నియోజకవర్గంలో రూ. 141.34 కోట్లతో డ్రైనేజీ పనులు, రూ. 78 కోట్లతో జిల్లా జైలు, గజ్వేల్‌లో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ వంటి కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తున్నామని, రాబోయే విద్యా సంవత్సరం నుంచే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు రఘునందన్ రావు, వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి భారీగా చేరికలు: బడ్జెట్‌లో బీసీలకు జరిగిన అన్యాయంపై రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు






హైదరాబాద్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: తెలంగాణ రాజకీయాల్లో సామాజిక చైతన్యానికి నాంది పలుకుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) లోకి చేరికల జోరు కొనసాగుతోంది, ఇందులో భాగంగా నేడు హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నారపల్లి మరియు కొర్రెముల ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు భారీ సంఖ్యలో టిఆర్‌పిలో చేరారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండ్ల తరబడి బీసీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించడానికే ఈ పార్టీ పుట్టిందని, మన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన రూ. 20,000 కోట్ల హామీని విస్మరించి కేవలం రూ. 12,000 కోట్లే కేటాయించడాన్ని పార్టీ తీవ్రంగా ఖండించింది. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 6 శాతం నిధులు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దీనికి నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా మరియు మండల కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, నాయకులు రాజేష్, కళ్యాణ్ మరియు కొత్తగా చేరిన సభ్యులు ఎస్. అవినాష్, బి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## సరికొత్త రికార్డు: సుదీర్ఘ కాలం పదవిలో ఉన్న ప్రజా నాయకుడిగా ప్రధాని మోదీ సరికొత్త చరిత్ర

హైదరాబాద్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: భారత రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ముఖ్యమంత్రిగా మరియు ప్రధానమంత్రిగా కలిపి సుదీర్ఘ కాలం పదవిలో కొనసాగిన ప్రజా నాయకుడిగా నిన్న (మార్చి 22, 2026) అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. గతంలో సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న 8,930 రోజుల రికార్డును అధిగమించి, మోదీ గారు 8,931 రోజులతో భారతదేశంలో అత్యధిక కాలం ప్రభుత్వానికి నాయకత్వం వహించిన నేతగా నిలిచారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, 2014 నుండి నేటి వరకు ప్రధానమంత్రిగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. ఈ అసాధారణ ప్రయాణంలో సుమారు 24 ఏళ్ల 5 నెలల 15 రోజుల పాటు నిరంతరాయంగా ప్రజా సేవలో కొనసాగుతూ, ఈ ఏడాది అక్టోబరు నాటికి 25 ఏళ్ల సుదీర్ఘ పాలనను పూర్తి చేసుకోబోతున్నారు. ఈ చారిత్రాత్మక మైలురాయిపై కేంద్ర మంత్రులు మరియు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది మోదీ గారి పట్ల ప్రజలకున్న తిరుగులేని విశ్వాసానికి నిదర్శనమని కొనియాడారు.

## తిరుమల పవిత్రత పరిరక్షణకు అత్యాధునిక సాంకేతికత: రూ. 25 కోట్లతో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ మరియు ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం





హైదరాబాద్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడటంతో పాటు భక్తులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేవలు అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మరో చారిత్రాత్మక అడుగు వేసింది. స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ మరియు FSSAI సంయుక్తంగా టీటీడీ సహకారంతో రూ. 25 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక వాటర్ - ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను నేడు ప్రారంభించడం జరిగింది. ఈ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన ఈ-టంగ్ (E-Tongue), ఈ-నోస్ (E-Nose) వంటి డిజిటల్ సాంకేతికత ద్వారా శ్రీవారి ప్రసాదాల తయారీలో వాడే ముడి పదార్థాల రుచి, వాసన మరియు నాణ్యతను అత్యంత ఖచ్చితత్వంతో విశ్లేషించే అవకాశం ఏర్పడింది. అదేవిధంగా, భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించి త్వరితగతిన దర్శన భాగ్యం కల్పించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ICCC)ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కేంద్రం ద్వారా జనసాంద్రత, వేచి ఉండే సమయం, వాహనాల రాకపోకలు మరియు వైద్య అత్యవసరాలను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టవచ్చు. పవిత్రత మరియు ఆధ్యాత్మికతతో పాటు అత్యాధునిక టెక్నాలజీని జోడించి భక్తుల మనోభావాలను గౌరవిస్తూ టీటీడీ చేస్తున్న ఈ కృషిపై శ్రీవారి భక్తుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

## సిద్ధిపేట వేదికగా హరీష్ రావుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటు కౌంటర్: "రాజకీయ నాయకుల కోసం కాదు.. పేదల కోసం పనిచేస్తాం"



హైదరాబాద్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: సిద్ధిపేట జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నర్మెట్టలో ప్రారంభించిన ఆయిల్ పామ్ కర్మాగారం ఇక్కడున్న ఎమ్మెల్యే కోసం కాదని, కేవలం రైతుల ప్రయోజనాల కోసమేనని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి వివక్ష చూపే తత్వం లేదని, 119 నియోజకవర్గాలను సమానంగానే చూస్తామని పేర్కొంటూ.. గతంలో కొడంగల్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. పదేళ్లు ప్రజలు మీకు అవకాశం ఇచ్చారని, ఇప్పుడు తమను ఆశీర్వదిస్తున్నారని, 2029లో మళ్లీ తమదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. సిద్ధిపేటలో దశాబ్దాలుగా ఒకే కుటుంబం నుంచి ప్రతినిధులు ఉంటున్నారని, ఇతరులకు కూడా ఒక్క అవకాశం ఇచ్చి మార్పు చూడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ గెలిపించిన వ్యక్తిని మంత్రిని చేసే బాధ్యతను తన సహచర మంత్రులకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. తాము పేదల సంక్షేమం కోసమే పనిచేస్తాం తప్ప, రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం కాదని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గట్టిగా హెచ్చరించారు.

## రాయికోడ్‌లో సర్పంచ్ సోదరుడి మృతి పట్ల సంతాపం: మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మఠం భిక్షపతి



రాయికోడ్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ గ్రామ సర్పంచ్ బాలమొల్ల తుకారం గారి సోదరుడు బాలమొల్ల మల్లేశం ఆకస్మిక మరణం పట్ల స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి గారు రాయికోడ్ గ్రామానికి వెళ్లి మృతుడి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లేశం మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. భిక్షపతి గారితో పాటు రాయిపల్లి సర్పంచ్ బస్వరాజ్, ఔరంగానగర్ మాజీ సర్పంచ్ నాగార్జున, పవన్, మల్లు, రాయికోడ్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, మొట్లకుంట సంగమేశ్వర్ తదితర నాయకులు ఈ పరామర్శలో పాల్గొని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## మెదక్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల అశోక్ రెడ్డి నియామకం: హర్షం వ్యక్తం చేసిన కార్యకర్తలు



మెదక్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గం టేక్మల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల అశోక్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్న ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం, రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు చేపట్టిన "సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఏఐసీసీ పరిశీలక కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యకర్తల అభిప్రాయాలను సేకరించిన అనంతరం రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన కొత్త జిల్లా కమిటీలో అశోక్ రెడ్డికి చోటు దక్కడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్ మరియు సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రైవేట్ స్కూళ్లపై మోజు వదలాలి: సిద్దిపేటలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పిలుపు

సిద్దిపేట, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్: తెలంగాణలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపాలనే మోజు నుంచి బయటపడాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు సూచించారు. సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వచ్చే విద్యాసంవత్సరం నుంచే రాష్ట్రంలో అత్యాధునిక వసతులతో కూడిన "తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను" ప్రారంభిస్తున్నామని, ఇవి నర్సరీ స్థాయి నుంచే నాణ్యమైన విద్యను అందిస్తాయని స్పష్టం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు పాలు, పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) వంటి ప్రత్యేక సౌకర్యాలు కూడా కల్పిస్తామని ఆయన వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులే అత్యంత ప్రతిభావంతులని కొనియాడుతూ, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతోనే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.




## శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో విశేష పూజలు ఘనంగా నిర్వహణ

మనూర్ మండల్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా మానూర్ మండలం పరిధిలోని బోరంచ గ్రామ శివారులో మంజీర నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగేష్ స్వామి అమ్మవారికి పంచామృతాలు, గంగాజలంతో అభిషేకం చేసి అనంతరం కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారికి నుదుట పసుపు, కుంకుమ తిలకం దిద్ది పట్టువస్త్రాలు సమర్పించగా, వివిధ రకాల సుగంధ పుష్పాలతో ఆలయాన్ని అద్భుతంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## శివయోగి శివచార్య స్వాముల 31వ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు



సదాశివపేట, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి టి సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం గాల తంగేడుపల్లి గ్రామ శివారులోని జంగమ్మయ్య గుట్ట వద్ద గల గంగాధర్ స్వామి మఠం, కోటిబిళవ లింగేశ్వర్ ఆలయంలో పీఠాధిపతి 108 శ్రీ శ్రీ శ్రీ శివయోగి శివచార్య స్వాముల వారి 31వ జన్మదినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకాంత్ పటేల్, తొర్నల్ సర్పంచ్ సంగమేష్ పటేల్, దుదగొండ ఉపసర్పంచ్ అనిల్ పటేల్ మరియు అరుణ్ తదితర నాయకులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. వీరు స్వామి వారికి శేష వస్త్రం సమర్పించి, పూలమాలలతో ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ వేడుకలో నియోజకవర్గానికి చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక సేవలో స్వామి వారు అందిస్తున్న స్ఫూర్తిని కొనియాడుతూ ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య: మొగలాయి కోట గ్రామంలో విషాదం



మొగలాయి కోట, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని మొగలాయి కోట గ్రామంలో మార్కపుడి కేశవ (36) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత కొంతకాలంగా విపరీతమైన మద్యపానానికి బానిసైన కేశవ, ఆరోగ్యం క్షీణించి లివర్ దెబ్బతినడంతో మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్రమైన కడుపునొప్పి రావడంతో మనస్తాపానికి గురై, ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో కేశవ మృతి చెందాడు. మృతునికి భార్య రేణుకతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతగిరి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సి.హెచ్. లింగారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## కంది మండలంలో ఘనంగా మల్లన్న జాతర: పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు





కంది, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా కంది మండలంలో గొల్ల సంఘం అధ్యక్షుడు జొన్నాడ బాల మల్లేశం, ఉపాధ్యక్షుడు చూనపురం భిక్షపతి ఆధ్వర్యంలో మల్లన్న జాతర భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టీఎస్ఐఐసి (TSIIC) చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మరియు డాక్టర్ శ్రీహరి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు జరగగా, కంది మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, గొల్ల సంఘం పెద్దలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తుల కోలాహలంతో, మల్లన్న నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి గారు మాట్లాడుతూ జాతరను ఇంత వైభవంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.

## ఇబ్రహీంపూర్ గ్రామంలో నూతన సీసీ రోడ్డు ప్రారంభం



ఇబ్రహీంపూర్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి బి రమేష్ బాబు: ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండల పరిధిలో గల ఇబ్రహీంపూర్ గ్రామంలో రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారి ప్రత్యేక కృషితో మంజూరైన నూతన సీసీ రోడ్డును ఆదివారం ఘనంగా ప్రారంభించారు. రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ మయోదిన్ మరియు మునిపల్లి మండల సీనియర్ నాయకులు ఖమ్మం పల్లి సంగన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి కట్టుబడి ఉన్నారని, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగానే ఈ రోడ్డు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ అలీ, దత్తుగౌడ్, రియాజుద్దీన్, రాములు గౌడ్, మున్నూరు ప్రభు, లింగమయ్య, అప్సర మియా, ఆబిద్మియా, అక్రమయ్యా, కుమార్, ఇషాక్, ప్రభాకర్, షేక్ యాదుల్, మొహమ్మద్ అనీఫ్, ఎల్ యాదయ్య, అష్రాఫ్, శ్రీరాములు తదితర ముఖ్య నాయకులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేగుల్వాడిలో పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమం నిర్వహణ




దేగుల్వాడి, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: కంగ్టి మండలం దేగుల్వాడి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎల్ఎస్ఏ బసయ్య స్వామి మరియు గ్రామ ఉప సర్పంచ్ మోహన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు సోకే గాలికుంటు వ్యాధి వల్ల కలిగే నష్టాలను వివరించారు మరియు ఈ వ్యాధిని నివారించేందుకు టీకాలు వేయించడం ఏకైక మార్గమని స్పష్టం చేశారు. రైతులందరూ బాధ్యతగా తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించి ఆరోగ్యంగా ఉంచుకోవాలని వారు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కిష్టారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిలతో పాటు పలువురు రైతులు మరియు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవి, అధ్యాపకులు ఎం.ఎండి.రఫీకి ఘన సత్కారం



నంద్యాల, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి, శెట్టి వెంకటేష్ గౌడ్, సీఈఓ: నంద్యాల జిల్లా సాహితీ స్రవంతి మరియు మిడి టౌన్ రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ వర్ధమాన కవి, గణిత శాస్త్ర అధ్యాపకులు మరియు రచయిత ఎం.ఎండి. రఫీని ఘనంగా సత్కరించారు. సీనియర్ న్యాయవాది శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వక్తలు మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగు భాషకు ఉన్న ప్రత్యేకతను, దాని మాధుర్యాన్ని కొనియాడారు. తెలుగు భాషా సంస్కృతులు మనకు గర్వకారణమని, విద్యార్థులు భాషపై పట్టు సాధిస్తే అన్ని రకాల పోటీ పరీక్షల్లో విజయకేతనం ఎగురవేయవచ్చని సూచించారు. ఎం.ఎండి. రఫీ తన సాహిత్య రచనల ద్వారా తెలుగు భాషా వికాసానికి చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని, ఆయన కవిత్వం సామాన్యులకు సైతం అర్థమయ్యేలా సులభంగా ఉంటుందని ప్రశంసించారు. కళారాధన ప్రధాన కార్యదర్శి రవికృష్ణ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వెదుర్ల రామచంద్రారావు మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడంలో కవుల పాత్ర కీలకమని, పుస్తక పఠనం వల్ల జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు కేశవమూర్తి మాట్లాడుతూ సమాజం కవులను, కళాకారులను గౌరవించినప్పుడే దేశం పురోభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రఫీ తాను రచించిన "ఉగాది - రంజాన్ విశిష్టత" అనే కవితను రాగయుక్తంగా వినిపించి అందరినీ అలరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, కళాకారులు పాల్గొని రఫీని దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



# హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం: పాల్గొన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఆర్య వైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొని, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడ హాజరైన ఆర్య వైశ్య ప్రముఖులను మరియు భక్తులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ఆర్య వైశ్యుల పాత్రను కొనియాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మహోత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు మరియు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్య వైశ్య సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు.



# ముప్పారం గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభం

ముప్పారం, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి బి రమేష్ బాబు: అల్లాదుర్గ్ మండలంలోని ముప్పారం గ్రామంలో గౌరవ మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారి ప్రత్యేక సహకారంతో మంజూరైన నూతన సీసీ రోడ్డును ఆదివారం ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ రావు మరియు బాలకిషన్ హాజరై అభివృద్ధి పనుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, మంత్రి గారి కృషితో గ్రామాలు వేగంగా అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్, ముప్పారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల విట్టల్ రెడ్డి, శేఖర్ పటేల్, నాయకులు ఆంజనేయులు, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్, వంశీ, నారాయణ, సునీల్, బీరప్పలతో పాటు గ్రామస్తులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోర్పోల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా – విజేతలకు బహుమతుల ప్రదానం



కోర్పోల్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి కె మల్లేశం గౌడ్: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం కోర్పోల్ గ్రామంలో నిర్వహించిన కోర్పోల్ ప్రీమియర్ లీగ్ (కెపిఎల్) క్రికెట్ టోర్నమెంట్‌కు మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో క్రీడలు మరియు వ్యాయామం ఎంతో ముఖ్యమని, క్రీడా స్ఫూర్తితో యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధికి భవిష్యత్తులో తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో జాన్సీ జట్టు విజేతగా నిలవగా, సూర్యవంశీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు మెమెంటోలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు సోహెల్, రామకృష్ణ, మురళి, మాణిక్యంలతో పాటు గ్రామ సర్పంచ్ సునీత ప్రవీణ్ రెడ్డి, ఉమ్మడి పుల్కల్ మండల మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉదయ్ బాబు మోహన్, మండల పార్టీ అధ్యక్షులు శివకుమార్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ యువకులు, నాయకులు పాల్గొన్నారు.



# ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడి: పౌరులను లక్ష్యంగా చేసుకుందని నెతన్యాహు ధ్వజం

డిమోనా, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఇజ్రాయెల్‌లోని డిమోనా ప్రాంతంలో ఇరాన్ జరిపిన క్షిపణి దాడి స్థలాన్ని ప్రధానమంత్రి బెన్యామిన్ నెతన్యాహు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే సామాన్య పౌరులు ఉండే నర్సరీలు, వృద్ధుల ఆశ్రమాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడిందని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయంగా నిషేధించిన క్లస్టర్ బాంబులను ఇరాన్ ఈ దాడుల్లో ప్రయోగించిందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ప్రపంచ దేశాలను ఇరాన్ బందీగా చేసుకుంటోందని నెతన్యాహు విమర్శించారు. పౌరులపై జరుగుతున్న ఇటువంటి దాడులను సహించబోమని, ఇరాన్ చర్యలకు తగిన రీతిలో బదులిస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ దాడితో డిమోనా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి

# ఔటర్ రింగ్ రోడ్‌పై ఘోర ప్రమాదం – ఒకరు మృతి

నార్సింగి, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: హైదరాబాద్ నగరం శివారులోని ఔటర్ రింగ్ రోడ్‌పై సోమవారం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుండి గచ్చిబౌలి వైపు వెళ్తున్న ఒక కారు, నార్సింగి పోలీస్ అకాడమీ సమీపంలో ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, గాయపడిన వారిని పోలీసులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు మరియు ఔటర్ రింగ్ రోడ్ సిబ్బంది క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి, భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తును చేపట్టారు.




# చాదర్‌ఘాట్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు: స్టెరాయిడ్ ఇంజక్షన్లు స్వాధీనం

చాదర్‌ఘాట్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి భారీగా స్టెరాయిడ్ ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను తనిఖీ చేయగా, వారి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 20 స్టెరాయిడ్ ఇంజక్షన్లు లభించాయి. వీటిని నిషేధిత పద్ధతిలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలతో పోలీసులు ఆ ఇద్దరు యువకులను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, ఈ సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్ గురించి లోతైన విచారణ జరుపుతున్నారు. నగరంలో యువతను పెడదోవ పట్టించే ఇలాంటి నిషేధిత ఔషధాల విక్రయాలు మరియు వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# శ్రీవాసవి మహాశక్తి మహోత్సవం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందనలు




హైదరాబాద్, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'శ్రీవాసవి మహాశక్తి మహోత్సవం' ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వేలాది మంది మహిళలు ఏకకాలంలో వాసవీ పారాయణం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. భక్తిశ్రద్ధలతో ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన మహిళామణులను, నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ ఆర్థిక పురోభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని, వారి సంస్కృతి మరియు సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇలాంటి ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పశ్చిమ ఆసియా సంక్షోభం: ఉపశమన చర్యలపై ప్రధాని మోదీ అత్యున్నత స్థాయి సమీక్ష

న్యూఢిల్లీ, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మరియు యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం, పౌరుల భద్రతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (CCS)తో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా భారత్ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ముడి చమురు సరఫరా, ఎరువుల లభ్యత మరియు నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో ఉండేలా స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక వ్యూహాలను అమలు చేయాలని ఆదేశించారు. హర్మూజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాల వల్ల వాణిజ్యం దెబ్బతినకుండా ఎగుమతి మార్గాలను వైవిధ్యీకరించుకోవాలని, ఇంధన భద్రత కోసం ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిత్యావసరాల కృత్రిమ కొరత సృష్టించే వారిపై, నల్లబజారుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. పశ్చిమ ఆసియాలో ఉన్న భారతీయ పౌరుల క్షేమం తమకు అత్యంత ప్రాధాన్యత అని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని విదేశాంగ శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరియు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు.



## ఏపీ పునర్నిర్మాణంపై చంద్రబాబు ఆశాభావం: పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం

అమరావతి, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణం మరియు అభివృద్ధి వ్యూహాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ISB) వేదికగా జరిగిన 'సౌత్ ఆసియా లెర్నింగ్ సమిట్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2024లో తాము అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశనమైందని, వ్యవస్థలు కుప్పకూలి బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఎదురైన కష్టాల కంటే గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర పరిస్థితి మరీ దారుణంగా తయారైందని విమర్శించారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యంత వేగంగా ప్రగతిశీల నిర్ణయాలు తీసుకున్నామని, సంక్షేమం, అభివృద్ధి మరియు సుపరిపాలన అనే మూడు ప్రధాన సూత్రాలతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ కృషితో ప్రస్తుతం పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ప్రపంచస్థాయి సంస్థలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చి, పూర్వ వైభవాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

## విశాఖకు చేరుకున్న మంత్రి నారా లోకేష్: రేపు నక్కపల్లిలో మెగా స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన



విశాఖపట్నం, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ విమానాశ్రయంలో ఉత్తరాంధ్రకు చెందిన తెలుగుదేశం పార్టీ కీలక నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. సోమవారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ మరియు నిప్పాన్ స్టీల్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న మెగా స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. దేశంలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారాల్లో ఒకటిగా నిలవనున్న ఈ ప్రాజెక్టు శంకుస్థాపనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో కలిసి మంత్రి లోకేష్ పాల్గొననున్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతంలో వేల సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో విశాఖ మరియు అనకాపల్లి జిల్లాల్లో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు.



## జీడిమెట్లలో "బస్తీ బాట" – ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి శ్రీకారం

జీడిమెట్ల, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల ప్రాంతంలో బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "బస్తీ బాట" కార్యక్రమం స్థానిక ప్రజల అపూర్వ స్పందన మధ్య విజయవంతంగా జరిగింది. బీసీ రాజ్యాధికార సమితి నాయకురాలు శ్రీమతి బాల్నే లలిత నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంజాయి ముఠాల వేధింపులపై స్థానికులు ఫిర్యాదు చేయగా, దాసు సురేశ్ వేదిక నుండే నేరుగా ఏసీబీ (ACP) అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పెన్షన్లు, ఆరోగ్య సేవలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మరియు రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలపై డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసు సురేశ్ మాట్లాడుతూ, ప్రజల గుమ్మం వద్దకే వెళ్లి వారి కష్టాలను తీర్చడమే నిజమైన నాయకత్వమని, ప్రజలు సమిష్టిగా ఉద్యమిస్తేనే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని పిలుపునిచ్చారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 7388611788 కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు, కార్యకర్తలు మరియు బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొల్లేరు పరిరక్షణకు అంతిమ హెచ్చరిక: ప్రధాని, ముఖ్యమంత్రికి బోలిశెట్టి సత్యనారాయణ బహిరంగ విన్నపం

ఏలూరు, మార్చి 23, 2026, సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రపంచ ప్రఖ్యాత కొల్లేరు సరస్సు ఉనికిని కాపాడాలని కోరుతూ జల బిరాదరి జాతీయ కన్వీనర్, ప్రముఖ పర్యావరణవేత్త బోలిశెట్టి సత్యనారాయణ దేశ ప్రధాని నరేంద్ర మోదీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రికి బహిరంగ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన 'కొల్లేరు అస్తిత్వ పునరుద్ధరణ - 2' నివేదికను విడుదల చేస్తూ, సరస్సు పరిరక్షణపై ప్రభుత్వాల మౌనాన్ని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ కొల్లేరు సరిహద్దులను కుదించే (డీ-నోటిఫికేషన్) ప్రయత్నాలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, లేనిపక్షంలో భారీ ప్రజా ఉద్యమం తప్పదని ఆయన అల్టిమేటం జారీ చేశారు. నిబంధనలను అతిక్రమించి అక్రమ ఆక్రమణలకు సహకరిస్తున్న అధికారులను జవాబుదారీలుగా చేయాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రాంతీయ సమస్య మాత్రమే కాదని, అంతర్జాతీయ పర్యావరణ సంస్థలైన ఐయూసీఎన్ (IUCN), రామ్సర్ కన్వెన్షన్ కూడా స్పందించి ఈ చిత్తడి నేలను కాపాడాలని కోరారు. కొల్లేరును ఆక్రమణదారుల నుంచి విముక్తి చేసి, దాని సహజ అస్తిత్వాన్ని పునరుద్ధరించడమే తమ ఏకైక డిమాండ్ అని, ఈ జలవనరు మనుగడ కోసం ప్రతి ఒక్క పర్యావరణ ప్రేమికుడు గళమెత్తాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆయన ప్రసంగించిన వీడియోలను మరియు డాక్యుమెంట్లను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.



## రైతు సంక్షేమానికి రెండు సంవత్సరాల్లోనే రూ. 1.10 లక్షల కోట్లు: మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (23-03-2026): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండు సంవత్సరాల కాలంలోనే రైతు సంక్షేమం కోసం లక్షా పదివేల కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసిన ఘనతను సొంతం చేసుకుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా, విద్య, వైద్యం, మహిళా సాధికారత మరియు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకమైన పాలనను అందిస్తున్నామని ఆయన వివరించారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సామాన్యులకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు

## నిరుద్యోగులకు ఉగాది కానుక: మెగా డీఎస్సీ మరియు జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

అమరావతి, సందేశం టైమ్స్ ప్రతినిధి (23-03-2026): గత ఐదేళ్ల కాలంలో ప్రతి ఏటా జనవరి 1న ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ అమలుకు నోచుకోలేదని, మెగా డీఎస్సీ పేరుతో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను వంచించారని కూటమి ప్రభుత్వం విమర్శించింది. అయితే, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొంది. ఇందులో భాగంగా మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు, అలాగే 6000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసింది. తాజాగా రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉగాది కానుకగా మరో 10,060 ఉద్యోగాల భర్తీకి సంబంధించి స్పష్టమైన నోటిఫికేషన్ తేదీలతో కూడిన జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ, పారదర్శకమైన పద్ధతిలో నిర్ణీత గడువులోగా ఈ ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేస్తామని ప్రభుత్వం ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.